సాక్షి ఖమ్మం

9

బుధవారం । 25 । డిసెంబర్ । 2024


ఖమ్మం ముస్తఫానగర్‌లోని బెరాకా చర్చిలో చిన్నారుల నృత్యం


విద్యుద్దీపాల అలంకరణలో వైరా రోడ్డులోని చర్చి

యుద్ధప్రాతిపదికన రిటైనింగ్ వాల్


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరద ముంపు నుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కలిగించేలా చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో రిటైనింగ్ వాల్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో మంగళవారం వారు సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మున్నేటికి ఇరువైపులా 24 కి.మీ. మేర ఆర్‌సీసీ కాంక్రీట్ గోడలు నిర్మిస్తుండగా, ముంపునకు అవకాశం లేకుండా 1969 నుంచి ఇప్పటివరకు వచ్చిన వరదలను పరిగణనలోకి తీసుకుని సరైన మార్గంలో నీరు సాగేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించిన ఆయన నెలలో రెండు సార్లు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని తెలిపారు. వాల్ నిర్మాణానికి భూసేకరణపై త్వరలోనే ఖమ్మంలో అధికారులతో సమీక్షించనున్నట్లు చెప్పారు.

రాజ్యాంగంపై కుట్రలు

- జీజేపీ వైఖరిని ఐదేళ్లుగా రాహుల్‌గాంధీ వివరిస్తున్నారు..
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



నిరసన ర్యాలీలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాజ్యాంగాన్ని బలహీనపరిచేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భట్టితోపాటు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. డీసీసీ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీజేపీ తీరు, ఆలోచనలను గత ఐదేళ్లుగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. తాజాగా పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానపరిచేలా చేసిన వ్యాఖ్యలతో రాహుల్‌గాంధీ చెబుతున్న మాటలు నిజమేనని తేలిందన్నారు. పౌరులందరికీ ఓటు హక్కు, మహిళలకు ఆస్తిలో వాటా, ఇష్టమైన మతాన్ని ఆచరించే హక్కు ఇలా ప్రతీది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే సంక్రమించాయని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశాన్ని కించపరిచేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో బీజేపీ నీచ సంస్కృతికి తెరలేపుతోందని ఆరోపించారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణతో పాటు పోట్ల నాగేశ్వరరావు, ఎం.డీ.ముస్తఫా, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, డజ్జల లక్ష్మి, మిక్కిలినేని మంజుల, రఫీదాబేగం, కొప్పెర సరిత, పల్లెబోయిన భారతి, రాపర్తి శరత్, విజయ, పైడిపల్లి రోహిణి, మందడపు లక్ష్మి, పి.విజయనిర్మల, షేక్ జాన్‌బీ, సైదుబాబు, నాగండ్ల దీపక్‌చౌదరి, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, శేఖర్‌గౌడ్, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు జననం.. అందరికీ శుభదినం

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలైంది. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం జరుపుకోనుండగా జిల్లాలోని చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అంతేకాక చర్చిల్లో క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్‌లను ఏర్పాటుచేయగా.. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు మొదలవడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు యేసుక్రీస్తు జనన వృత్తాంతం, ఆయన బోధనలను వివరించారు. ఇక బుధవారం తెల్లవారుజాము నుంచి చర్చిల్లో మొదలయ్యే ప్రార్థనలు మధ్యాహ్నం వరకు కొనసాగనున్నాయి. – సాక్షి నెట్‌వర్క్


వైరాలోని ఆర్‌సీఎం చర్చిలో బాలయేసు ప్రతిమను ప్రదర్శిస్తున్న ఫాదర్ మాదాసు రాజు

నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధ, గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న ఆయన వేంసూరు మండలం కందుకూరులో జరిగే ఓ కార్యక్రమానికి హాజరయ్యాక స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో బస చేస్తారు. గురువారం ఉదయం భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారం, గున్నెపల్లిలో గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించనున్న మంత్రి, 11 గంటలకు దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత 11.30 గంటలకు అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం, ములకలపల్లి మండలం కొత్తూరులో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మీదుగా పెనుబల్లికి చేరుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. ఆతర్వాత కల్లూరు మండలం పాయపూర్, తల్లాడ మండలం పినపాకలో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఈనెల 30 వరకు ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలు



ఖమ్మంసహకారనగర్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన ప్రస్తుత విద్యాసంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశముందని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.పాపారావు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల కోసం ప్రత్యేక షెడ్యూల్ ప్రకటించినందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు సమీపంలోని ఓపెన్ స్కూల్ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 80084 03522 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని వారు ఓ ప్రకటనలో తెలిపారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి



వైద్యశిబిరంలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఖమ్మంఅర్బన్: వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్న ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. మంచుకొండ ఆరోగ్య కేంద్రం పరిధి ధంసలాపురంకాలనీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈశిబిరంలో స్థానికులకు రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించాక ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆతర్వాత డీఎంహెచ్‌ఓ కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి వరదల సమయాన పాడైన పరికరాలు, రికార్డుల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, డీపీఓ మేకల దుర్గ, డాక్టర్ విష్ణుసింగ్‌తో పాటు ఉద్యోగులు గోలి రమాదేవి, తాల్లూరి శ్రీకాంత్, రాధ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక

ఖమ్మంవ్యవసాయం: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ ఆధారంగా సరఫరా చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కొత్తగా ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయగా, మరో ఆరు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమైందని వెల్లడించారు. అంతేకాక ఇంకో పది పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచనున్నట్లు తెలిపారు. గత ఏడాది విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని నూతనంగా 597 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుచేయనుండగా, ప్రస్తుతం ఉన్న వాటిపై భారం తగ్గుతుందని ఎస్ఈ పేర్కొన్నారు.

జిల్లాను తాకిన అల్పపీడనం


తిరుమలాయపాలెం : పిండిప్రోలులో మిర్చి రాశులపై కప్పిన పట్టాలు

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జిల్లాను తాకింది. దీంతో మంగళవారం ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడమే కాక పలుచోట్ల వర్షం కురిసింది. మంగళవారం గరిష్టంగా 27 డిగ్రీలు, కనిష్టంగా 21 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా చలిగాలులకు తోడు సాయంత్రం తర్వాత ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంతో పాటు పాలేరు, వైరా నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఉండడం రైతులను అలజడికి గురిచేస్తోంది. ప్రస్తుతం వరి కోతలు చివరి దశలో ఉండగా కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోశారు. మరోపక్క పత్తితీత ఆఖరులో ఉండడంతో వర్షం కారణంగా నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక పలువురు రైతులు మిర్చి కూడా కోయగా కల్లాల్లోనే ఆరబోశారు. వర్షసూచనలతో రైతులు ధాన్యం, మిర్చి రాశులపై పట్టాలు కప్పగా పలుచోట్ల వర్షపునీరు నిలిచింది. అలాగే, మామిడి పూత ఆశాజనకంగా లేదని రైతులు చెబుతుండగా ప్రస్తుత వాతావరణం వారిని భయపడుతోంది. అంతేకాక అల్పపీడన ప్రభావం కారణంతో చలి గణనీయంగా పెరగగా సాయంత్రం తర్వాత రహదారులపై జనసంచారం తగ్గింది.

అందుబాటులోకి సీఎస్‌సీ వాహన సేవలు



వాహనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో అమల్లోకి వచ్చిన కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) వాహనం ద్వారా పకడ్బందీగా సేవలు అందించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి సూచించారు. జిల్లాకు కేటాయించిన వాహనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటుచేయగా ప్రజలకు వైద్య, విద్య, ఉపాధి తదితర రంగాల్లో సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ సేవలను మరింత విస్తృతం చేసేందుకు వాహనాన్ని సమకూర్చారని, ఈ వాహనం ద్వారా నిర్దేశిత తేదీల్లో గ్రామాల్లోనే సేవలందిస్తారని చెప్పారు. ఈ ప్రాజెక్టును దేశవ్యాప్తంగా పది జిల్లాలను ఎంపిక చేయగా జాబితాలో ఖమ్మం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఫయాజ్, ఈడీఎం దుర్గాప్రసాద్, జిల్లా మేనేజర్ పి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై దాడి ఘటనలో కుమారుడిపై కేసు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని గడ్డికుంటతండాలో తల్లిపై దాడి చేసిన కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. గడ్డికుంట తండాకు చెందిన గుగులోత్ లాలీపై ఆమె కుమారుడు రాజు మద్యం మత్తులో కర్రతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యాశాఖలో మరో కుదుపు

నలుగురు ఉపాధ్యాయుల రివర్షన్

- పదోన్నతుల్లో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించడమే కారణం
- గతంలో డీఎస్సీలో ఏడుగురు హిందీ ఉపాధ్యాయుల నియామకం రద్దు



డీఈఓ కార్యాలయంలో వివరాలు పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న ఘటనలు, అధికారుల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. ఏళ్ల తర్వాత ఉపాధ్యాయుల నియామకానికి డీఎస్సీ నిర్వహించగా.. ఇటీవల అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. అయితే, అటు డీఎస్సీ.. ఇటు పదోన్నతుల్లోనూ అధికారుల నిర్లక్ష్య వైఖరితో పలు లోపాలు చోటు చేసుకోగా అవి ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. డీఎస్సీ–2024లో హిందీ ఉపాధ్యాయులు(లాంగ్వేజ్ పండిట్లు)గా నియమితులైన ఏడుగురిని కొన్నాళ్లకు అర్హులు కాదని నిర్ధారించి తొలగించడం తెలిసిందే. ఇక పదోన్నతుల్లోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వస్తుండగా మంగళవారం నలుగురికి రివర్షన్ ఇవ్వడం గమనార్హం. నియామకాలు, పదోన్నతుల సందర్భంగా అర్హత సర్టిఫికెట్ల పరిశీలన సమయాన అధికారులు పట్టించుకోకుండా ఇప్పుడు చర్యలు తీసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది.

ఏడుగురిలో అంతా అర్హులేనని...

జిల్లాలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు)లుగా పదోన్నతులు ఇచ్చేందుకు జూన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందుకోసం జిల్లాలో 21పోస్టులకు ఏడుగురే దరఖాస్తు చేసుకోగా సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అందరూ అర్హులేనని అధికారులు అప్పట్లో తేల్చారు. దీంతో పదోన్నతులు కూడా ఇచ్చేశారు. అయితే, అందులో నలుగురు అనర్హులని చెబుతూ వారిని రివర్షన్ చేస్తూ మంగళవారం డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకో ఇద్దరి సర్టిఫికెట్లు పరిశీలిస్తుండగా, మరో ఉపాధ్యాయుడు మాత్రమే అర్హులుగా తేలినట్లు తెలిసింది. స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు)గా పదోన్నతికి స్పెషల్ బీఈడీతో పాటు రీహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) జారీ చేసిన సెంట్రల్ రిహాబిలిటేషన్ రిజిస్ట్రీ(సీఆర్‌ఆర్) ధ్రువపత్రం తప్పనిసరి. అంతేకాక అభ్యర్థికి స్పెషల్ బీఈడీ విద్యార్హత లేకపోతే రెగ్యులర్ బీఈడీ చేశాక దివ్యాంగులకు సంబంధించి ప్రత్యేక కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఆపై ధ్రువపత్రాలను సీఆర్‌ఆర్‌లో నమోదై చేసుకోవాలి. అలాంటి వారినే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా... ఇవేమి లేకుండానే పదోన్నతులు ఇచ్చిన అధికారులు ఇప్పుడు వెనక్కి తీసుకోవడం గమనార్హం.

అసలేం జరుగుతోంది.

జిల్లా విద్యాశాఖపై ఆరోపణలు వెల్లువెత్తుతుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ఆ ఆరోపణలన్నీ నిజమవుతుండడం శాఖ ప్రతిష్ఠను మసకబారుస్తోంది. డీఎస్సీ–2024 నియామకాల్లో హిందీ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చి 20రోజుల పాటు విధులు నిర్వర్తించాక నియామకాలు రద్దు చేయడం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరు హెచ్‌ఎంలపై చర్యలు తీసుకున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇక ఇప్పుడు పదోన్నతుల విషయంలో అదే మాదిరి జరగగా... ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే తప్ప జిల్లా విద్యాశాఖ గాడిన పడే అవకాశం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయాన శాఖ పరిధిలో నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే ఆ ప్రభావం ఫలితాలపై పడుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జిల్లాలో ఏడుగురు ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ-స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతులు కల్పించాం. ఆతర్వాత అనుమానం రావడంతో పూర్తి వివరాలను సమర్పించాలని సూచించాం. దీంతో నలుగురు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని తేలడంతో రివర్షన్ చేశాం. మిగతా వారి సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. తప్పుడు వివరాలు సమర్పించిన వారి అంశంపై ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

– ఈ.సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ

రఘునాథపాలెం: గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లోని అటవీ భూముల్లో మొక్కలు నాటించాలని, తద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే, శ్మశాన వాటికల్లో సమస్యల పరిష్కారం, అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు అందించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఉన్న నిధులతో దశలవారీగా అవసరమైన పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఆర్డీఓ నరసింహారావు, తహసీల్దార్ విల్సన్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ మహేష్, ఏఈ చిరంజీవి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, యరగర్ల హన్మంతరావు, వాంకుడోత్ దీపక్, కేలోత్ దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: నల్లగొండలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ఆరో విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సంఘం భవనంలో మంగళవారం ఆమె జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో కలిసి సభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సభల్లో భాగంగా ఈ నెల 28న ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుందని, తొలిరోజు ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సభల్లో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యంగా చర్చించి నిర్ణయాలు, తీర్మానాలు చేస్తామని వెల్లడించారు. కాగా, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నందున వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జీవీ నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, మండవ నర్సయ్య, బానోత్ రాందాస్, ధర్మసోత్ నాగేశ్వరరావు, వీవీ రామారావు, పెనబాక సురేశ్, గుగులోత్ రామకృష్ణ, కట్టా పద్మ, అనుమోలు కోటేశ్వరరావు కె.విజయ్‌కుమార్, దొడ్డా ఉమామహేశ్వరరెడ్డి, నారపోగు సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

ఖమ్మంసహకారనగర్: గత రెండున్నర ఏళ్లుగా మానసిక వేదనకు గురవుతున్న రాష్ట్రంలోని 5,139 మంది వీఆర్వోలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం చరిత్రలో నిలిచిపోతుందని వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు అన్నారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది వీఆర్వోలు, వారి కుటుంబాలకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. గత ప్రభుత్వం వీఆర్వోలను రెవెన్యూ శాఖ నుంచి విడదీయడమే కాకుండా వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మిగతా మంత్రులు, ఉన్నతాధికారుల చొరవతో తిరిగి రెవెన్యూ శాఖలోకి తమను తీసుకుంటున్నారని తెలిపారు. అయితే, గత సర్వీస్, పదోన్నతుల పైనా నిర్ణయం వెలువరించాలని ఉపేందర్‌రావు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం బాధ్యులు చీమల నాగేంద్రబాబు, బంక కృష్ణ, షేక్ జానీమియా, వజ్జ రామారావు, చర్ల శ్రీనివాస్, ధరావత్ భాస్కర్, కిషోర్, నెల్లూరు లవన్ కుమార్, బంక భాస్కర్, శ్రీవాణి, మల్లీశ్వరి, వాంకుడోత్ వెంకన్న, ధన్నూరి బాలరాజు, చిట్టిమళ్ల నాగేశ్వరరావు, షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులను అభినందించిన సీపీ



పోలీస్ ఉద్యోగులు, ఏపీపీతో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పెనుబల్లి మండలంలో రాజకీయ వివాదాలతో 2019లో జరిగిన హత్య కేసులో ఏడుగురు నిందితులకు జైలుశిక్ష పడేలా పకడ్బందీగా విచారణ చేపట్టిన పోలీసు ఉద్యోగులను సీపీ సునీల్‌దత్ అభినందించారు. ఇటీవలే తీర్పు పడగా ఖమ్మంలో ఆయన మంగళవారం ఉద్యోగులను అభినందించడంతో పాటు రివార్డులు అందజేశారు. కేసు విచారణలో సరైన సాక్ష్యాధారాలు సేకరించడంతో నిందితులకు శిక్ష వేయించడం సాధ్యమైందన్నారు. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ టి.రవికుమార్, ఎస్సై నాగరాజు, ఏపీపీ అబ్దుల్ బాషా, కానిస్టేబుల్ గిరి, హోంగార్డు సురేష్ బాబును సీపీ అభినందించారు.

రేపు భారీ ప్రదర్శన, ఆవిర్భావసభ

సీపీఐ నాయకుడు హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించడంతో సభ ఏర్పాటుచేసినట్లు పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 26వ తేదీన ఉదయం 10 గంటలకు పాత కలెక్టరేట్ నుండి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ఎర్ర దండు కవాతు, ఆతర్వాత భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆవిర్భావ సభ ఉంటుందని చెప్పారు. తొలుత ఇందిరానగర్‌లోని పైలాన్ వద్ద అరుణ పతాకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆవిష్కరిస్తారని తెలిపారు. కాగా, స్వాతంత్ర సంగ్రామంలోనే కాక ఆతర్వాత అనేక పోరాటాల్లో సీపీఐ కీలక భూమిక పోషించిందని, హక్కుల సాధన, త్యాగాలు తమ పార్టీ సొంతమని తెలిపారు. కమ్యూనిస్టుల చేసిన పోరాటాలతోనే భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణ, ఉపాధిహామీపథకం, సమాచార హక్కుచట్టం, ఎనిమిది గంటల పనివిధానం అమల్లోకి వచ్చాయని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

ఖమ్మం సహకారనగర్: సర్వీసు క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీసౌజన్య, జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌పాషా మాట్లాడుతూ కేజీబీవీల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు కూడా 27వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటారన్నారు. కాగా, సమ్మెలో భాగంగా కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలపగా డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు విజయలక్ష్మి, నిర్మల, అనిల్, మదార్, సైదులు, కృష్ణప్రసాద్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ నాయకుడు ఎస్.విజయ్ మంగళవారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

నేలకొండపల్లి: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన ధాన్యం చివర గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా 29 కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఇప్పటివరకు దాదాపు 2లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. సన్నధాన్యం అమ్మిన రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. కాగా, ప్రసుత్త వాతావరణంలో మార్పులు వస్తున్న సందర్భంగా ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ కె.సందీప్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కార్యదర్శి నాగేశ్వరి, సూపర్‌వైజర్ భాస్కర్‌తో పాటు సొసైటీల చైర్మన్లు, సీఈఓలు గూడవల్లి రాంబ్రహ్మం, అనంతు కాశయ్య, ఏ.నాగేశ్వరరావు, జగదీష్ దితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. జగన్నాధపురం బస్టాండ్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఇసుక రవాణాకు అనుమతి లేదని గుర్తించామని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు. ఈమేరకు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.